ఈనాడు
ఒడిశా
బుధవారం అక్టోబరు 2, 2024

రేపు హస్తినలో పెట్టుబడిదారుల సదస్సు

నేడు వెళ్లనున్న మోహన్‌చరణ్



మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: హస్తినలో గురువారం పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, పరిశ్రమలశాఖ మంత్రి సంపద్ స్వయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి దిల్లీ ప్రయాణమవుతారు. మంత్రి సంపద్ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ... హస్తినలో ఏర్పాటయ్యే సదస్సులో విదేశీ కంపెనీల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వారితో ముఖ్యమంత్రి ముఖాముఖి మాట్లాడతారని, సానుకూల ఫలితాలు వస్తాయన్న ఆశాభావం ఉందన్నారు. 2036 నాటికి స్వతంత్ర ఒడిశా వందేళ్ల వేడుకలు జరుపుకోనుందని, ఈ వ్యవధిలోగా రాష్ట్రం పారిశ్రామికంగా దేశంలో అగ్రగామిగా నిలుస్తుందన్న నమ్మకంతో ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటోందని చెప్పారు. డబుల్ ఇంజిన్ పాలన రావడంతో ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

దక్షిణ మండల డీఐజీ సార్థక్ షడంగి



విలేకరులతో మాట్లాడుతున్న సార్థక్ షడంగి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర, గంజాం, గజపతి, కొంధమాల్, బౌద్ధ్ జిల్లాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు దక్షిణ మండల డీఐజీగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సార్థక్ షడంగి అన్నారు. ఉదయం ఆయన జయనారాయణ పంకజ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో వివిధ అంశాలపై మాట్లాడారు. గతంలో బ్రహ్మపుర ఎస్పీగా పని చేసిన షడంగి తర్వాత బదిలీపై వేరే జిల్లాకు వెళ్లారు. సాధారణ ఎన్నికల సమయంలో తిరిగి బ్రహ్మపుర ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సంగతి విదితమే.

నారాయణి అవతారంలో చండీమాత



రాష్ట్ర ప్రజల ఆరాధ్య దేవత కటక్ చండీమాత ఆశ్వయుజ బహుళ పక్షం చతుర్దశి తిథిని పురస్కరించుకొని మంగళవారం నారాయణి అవతారంలో అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక సేవలు, షోడశోపచార పూజలు కొనసాగాయి.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

భువనేశ్వరిగా విమలాదేవి



కొరాపుట్ శబరి శ్రీక్షేత్ర ప్రాంగణంలోని మంగళవారం విమలాదేవిని భువనేశ్వరీ అవతారంలో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

–న్యూస్‌టుడే, కొరాపుట్

మంచు దుప్పటి కప్పుకున్న బొణై

సుందర్‌గఢ్ జిల్లాలోని బొణై మంగళవారం మంచు దుప్పటి కప్పుకుంది. దీంతో అటవీ సంపదకు నిలయమైన ఈ ప్రాంతం కొత్త అందాలు సంతరించుకుంది. ఉదయం 8 వరకు మంచు కురిసింది. ఈ దృశ్యాన్ని ఎంతోమంది కెమెరాల్లో బంధించారు.

–న్యూస్‌టుడే, భువనేశ్వర్



పితృ కర్మలకు వచ్చి ప్రాణాలు కోల్పోయారు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పవిత్ర ఆశ్వయుజ మాసంలో పూరీ నరేంద్ర పుష్కరిణిలో పితృకర్మలు చేయడానికి వచ్చిన ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం వీరు పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి పూజలు చేశారు. సంతర్పణ చేసిన తరువాత పూజా వస్తువులు విడిచిపెట్టడానికి నీటిలో దిగి మునిగిపోయారు. కొద్దిసేపటి తరువాత మృతదేహాలు నీటిపై తేలాయి. పూరీ సింహద్వార థానా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి మృతదేహాలను వెలుపలికి తెచ్చి పరీక్షల కోసం తరలించారు. మృతులు, ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారన్నది తెలియలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అక్టోబర్ నెల.. వణికే నిలువెల్లా..

- బంగాళాఖాతంలో పొంచి ఉన్న తుపానులు
- నవంబరు వరకు రాష్ట్రానికి గడ్డుకాలం

అక్టోబరు.. ఈ నెల పేరు వింటేనే రాష్ట్ర ప్రజల వెన్నులో వణుకు పుడుతుంది. ఉరుము ఉరిమినా, మెరుపు మెరిసినా వారిలో ఆందోళన మొదలవుతుంది. చిన్నపాటి గాలి వీచినా రైతులు అల్లాడిపోతారు. పైలిన్, హుద్ హుద్, అంపన్.... ఇలా పేరేదైనా, ఎక్కడ తీరం దాటినా రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ సీజన్‌లో బంగాళాఖాతంలో విపత్తులు పొంచి ఉంటాయి. ఈ నెలలో వచ్చిన తుపానులు ప్రాణ, ఆస్తినష్టం తీవ్రంగా మిగిల్చాయి.

పదేళ్లలో రూ.వేల కోట్ల నష్టాలు

1999 అక్టోబరు 18న గోపాలపూర్, 29న జగత్సింగ్‌పూర్ జిల్లా ఎరసమ వద్ద తీరాలు దాటిన తుపానులు ప్రాణ, ఆస్తి నష్టాలు మిగిల్చాయి. పరదీప్‌కు చేరువలో ఎరసమ వద్ద తాకిన ప్రచండ తుపాను, ఉప్పెనల వల్ల 10 వేల మంది అధికారికంగా మృతి చెందారు. అనధికారికంగా మృతుల సంఖ్య 30 వేలు ఉంటుందని అంచనా. లక్షల్లో వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోయాయి. ఉత్తరకోస్తాలోని 14 జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఉప్పెనలో 30 ఊళ్లు తుడిచిపెట్టుకుపోయాయి.



గోపాల్‌పూర్ వద్ద పైలిన్ తుపాను విలయం (పాత చిత్రం)

న్యూస్‌టుడే, గోపాలపూర్

ఏటా అక్టోబరులో రాష్ట్రానికి తుపానుల ముప్పు తీవ్రంగా ఉంటుంది. నైరుతి రుతుపవనాలు సెప్టెంబరు నెలాఖరులో వెనక్కి మళ్లుతాయి. ఈశాన్య రుతుపవనాలు పుంజుకుంటాయి. ఈ సమయంలో అండమాన్ సముద్రంలో అల్పపీడనాలు ఏర్పడడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయి. క్రమేణా వాయుగుండాలు, తుపానులుగా మారతాయి. ఈ విపత్తులన్నీ ఆంధ్రప్రదేశ్ లేదా ఒడిశా తీరాలు దాటి ప్రళయం సృష్టిస్తాయి. ప్రాణ, ఆస్తి నష్టాలు మిగులుస్తున్నాయి. గంజాం, ఖుర్దా, పూరీ, కేంద్రపడ, జగత్సింగ్‌పూర్, భద్రక్, బాలేశ్వర్ జిల్లాలు తీరానికి చేరువగా ఉన్నాయి. తుపానుల ముప్పు వీటికి ఎక్కువ. రాష్ట్రానికి 480 కిలోమీటర్ల తీరం ఉంది.



పొంచి ఉన్న తుపానులు

ఒడిశాలో తీరం దాటే అవకాశాలు ఎక్కువ



ప్రముఖ ఐఎండీ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ **శరత్‌చంద్ర సాహు** మాట్లాడుతూ.. అక్టోబరు ప్రథమార్థం నుంచి నవంబరు నెలాఖరు వరకు అండమాన్‌లో ఏర్పడే పీడనాలు తుపానులుగా బలం పుంజుకోవడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తాయన్నారు. ఇవి ఒడిశాలో తీరం అతిక్రమించడానికి అవకాశాలు ఎక్కువన్నారు. గోపాలపూర్, మహాళపడ, పరదీప్ తీరాలు అనుకూలమన్నారు. విపత్తులపై ముందస్తుగా కొన్ని విదేశీ మెట్ సంస్థలు అంచనా వేస్తున్నా కచ్చితమైన అధ్యయనం ఐఎండీ మాత్రమే చేయగలదని, ఇది నిరూపితమైందన్నారు. కేంద్ర ఎర్త్ సైన్స్ శాఖ రాడార్ కేంద్రాలకు అవసరమవుతున్న యంత్ర సామగ్రి సమకూరుస్తోందన్నారు.

74 దాటితే తుపాను



స్థానిక ఐఎండీ కేంద్రం అధికారి **ఉమాశంకర్ దాస్** సోమవారం 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. బంగాళాఖాతం ఉపరితలంలో గాలి తీవ్రత సాధారణంగా 25 కిలోమీటర్లుగా ఉంటుందన్నారు. అల్పపీడనాలు ఏర్పడితే వేగం 35 నుంచి 45 కి.మీ.కు పెరుగుతుందన్నారు. పీడనాలు వాయుగుండాలుగా మారితే గాలి తీవ్రత 50 నుంచి 60 కిలోమీటర్లకు పెరుగుతుందని, తీరంవైపునకు పెనుగాలులు వీస్తాయన్నారు. వాయుగుండంతో గాలి వేగం 74 కిలోమీటర్లు దాటితే తుపానుగా మారుతాయన్నారు. ఇది 125 నుంచి 164 కిలోమీటర్లకు పెరిగితే 'సివియర్ సైక్లోన్'గా ప్రకటిస్తామన్నారు. 165 నుంచి 224 కిలోమీటర్లు గాలి వేగం ఉంటే 'వెరీ సివియర్'గా పరిగణిస్తామన్నారు. 225 నుంచి 279 కిలోమీటర్ల తీవ్రత ఉంటే 'సూపర్ సైక్లోన్'గా ప్రకటిస్తామన్నారు. తుపానుల తీవ్రత అంచనా వేసి ఓడరేవులకు హెచ్చరికలు జారీ చేస్తామన్నారు. 1 నుంచి 3 వరకు సాధారణం కాగా 10వ ప్రమాద హెచ్చరిక విధ్వంసానికి సూచికన్నారు. ఈ విపత్తుల వల్ల ఆయా ప్రాంతాల్లో ఎన్ని సెంటీమీటర్ల వాన కురుస్తుంది. భూమి కోతలకు అవకాశం ఉందా అన్నది చెప్పగలుగుతున్నామన్నారు. తుపానుల గురించి ప్రతి గంటకు విపత్తు నివారణ శాఖకు, ప్రసార సాధనాలకు తెలియపరుస్తున్నామన్నారు.

రెండు రాడార్ కేంద్రాలు

తుపానుల రాకపోకలను ముందుగా తెలుసుకోగలిగితే ప్రాణనష్టం నివారించవచ్చు. వరుస విపత్తులను దృష్టిలో పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ముందస్తు చర్యలు చేపట్టాయి. అత్యాధునిక సాధనా సంపత్తి వినియోగంలోకి వచ్చాయి. ఈ క్రమంలో తూర్పు తీరంలో కీలకమైన గోపాలపూర్, పరదీప్‌లలో అత్యాధునిక డాప్లార్ రాడార్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఇస్రో సాంకేతిక పరిజ్ఞానం గల గోపాలపూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అత్యంత శక్తివంతమైనది. 500 కిలోమీటర్ల పరిధిలో సముద్రంలో జరిగే పరిణామాలన్నీ తెలియజేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. సమీప భవిష్యత్తులో బాలేశ్వర్, సంబల్‌పూర్‌లలో మరో రెండు ఐఎండీ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. ఇవి రైతుల సమాచారం కోసం ప్రత్యేకం. ప్రభుత్వ విపత్తులను సమర్థంగా ఎదుర్కోవడానికి 20 ఓడ్రాఫ్ దళాలు, 864 ఆశ్రయ కేంద్రాలు నిర్మించింది. సహాయ కార్యక్రమాలకు అవసరమైన సాధనా సంపత్తి సమకూర్చుతుంది. దీంతో ప్రాణ నష్టం తగ్గింది. విపత్తుల నివారణలో ఒడిశా అగ్రగామిగా నిలిచింది. త్వరలో మరో 10 ఓడ్రాఫ్ దళాలు ఏర్పాటు కానున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులూ జరిగాయి.



పూరీలో ఫాని విధ్వంసం (పాత చిత్రం)

తుపానుల వల్ల నష్టాలు ఇలా

- 2013 అక్టోబరు 12న గోపాలపూర్ వద్ద తీరం దాటిన పైలిన్ తుపానుతో రూ.14 వేల కోట్లు
- 2014లో విశాఖ వద్ద విలయం సృష్టించిన హుద్‌హుద్ రూ.4,949 కోట్లు
- 2018లో శ్రీకాకుళం జిల్లా పలాస మండలం, వజ్రపుకొత్తూరు చేరువలో తీరం దాటిన 'తిత్లీ' రూ.2779 కోట్లు
- 2019లో పూరీ వద్ద తీరం దాటిన 'ఫాని' రూ.9,336 కోట్లు
- 2019లో 'బుల్‌బుల్' రూ.224.43కోట్లు
- 2020లో అంపాన్ వల్ల రూ.236.68 కోట్లు
- 2020లో 'యాస్' తుపాను రూ. 823.49 కోట్లు 'గులాబ్' వల్ల రూ.34.21 కోట్లు
- 2021లో 'జవాద్' తుపాను వల్ల రూ.376.51 కోట్లు

భద్రక్‌లో పురాతన శివపార్వతుల ప్రతిమలు లభ్యం

ఓ సేవకుడి ఇంట్లో గుర్తించిన వీటి విలువ రూ. 5 కోట్లు పైమాటే



తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: భద్రక్ జిల్లాలో అరుదైన శివపార్వతుల విగ్రహాలు, ఇతరత్రా బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. అఖండలమణి మందిరంలో సేవకుని ఇంట్లో జరిపిన తవ్వకాల్లో వీటిని గుర్తించారు. ఈ విగ్రహాల విలువ రూ.5 కోట్లకుపైగా ఉంటుందని అంచనా. వివరాల్లోకి వెళితే... భద్రక్ జిల్లా ఆరడిలోని అఖండలమణి మందిరంలో సేవకునిగా రబినారాయణ మిశ్ర విధులు నిర్వహిస్తున్నారు. మందిరానికి సమీపాన నివసిస్తున్న ఈయన ఇంట్లో అపూర్వమైన సంపద ఉన్నట్లు గత కొద్ది రోజులుగా అనిపిస్తుండడంతో ఈ విషయాన్ని పూజారి నరోత్తమ్ మిశ్రాకు తెలియజేశారు. పూజారి సూచన మేరకు రబి ఇంట్లో 6 x 6 అడుగుల పొడవు, వెడల్పు పరిమాణంతో 15 అడుగుల లోతున తవ్వారు. ఓ ఇత్తడి బిందెను గుర్తించగా అందులో శివ, పార్వతీ, గణేశ, నంది ప్రతిమలతోపాటు బంగారు నగలు ఉన్నాయి. తవ్వకందారులు ఇవి బంగారు విగ్రహాలని చెబుతున్నా రబినారాయణ్ నమ్మలేదు. ఈ విషయాన్ని సేవకుడు దాచిపెట్టాలని చూసినా, పూజారి వెలుగులోకి తెచ్చాడు. దీనిపై ప్రముఖ పరిశోధకుడు అనిల్‌ధిర్ మాట్లాడుతూ మొఘలులు, ఆఫ్ఘాన్ ఆక్రమణదారుల దాడులకు భయపడి చాలాచోట్ల విలువైన సంపదను దాచి పెట్టినట్లు ఎన్నో రికార్డులు పేర్కొంటున్నాయన్నారు.

దుర్గా పూజల నిర్వహణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టరు ధీనహ దస్తాగీర్. పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, పూజా కమిటీల ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో ప్రశాంతంగా దుర్గాపూజల నిర్వహణకు అంతా సహకరించాలని బ్రహ్మపుర సబ్‌కలెక్టరు ధీనహ దస్తాగీర్ కోరారు. మంగళవారం సాయంత్రం బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయం సమావేశ మందిరంలో దుర్గా పూజల నిర్వహణపై సన్నాహక సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ధీనహ దస్తాగీర్ మాట్లాడుతూ ప్రస్తుతానికి నగరంలో 42 చోట్ల పూజా పెండాల్ల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయని, ఇందుకోసం అవసరమైన అన్ని అనుమతులకు బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయంలో సింగిల్ విండో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పూజా మండపాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అష్టమి, నవమి, దశమి రోజుల్లో సాయంత్రం 5 గంటలకు అన్ని మద్యం దుకాణాలు మూసేయాలన్నారు. ఈ నెల 14న నిమజ్జనోత్సవాలు జరుగుతాయని, ఆ రోజున పూర్తిగా మద్యం దుకాణాలు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె సంబంధిత శాఖల అధికారుల్ని ఆదేశించారు. ఇంకా ఇందులో వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో వివిధ పూజా కమిటీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

ఆరు నెలల్లో 22 లక్షల మందికి ఇళ్లు



రబినారాయణ నాయక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రానున్న ఆరు నెలల్లో 22 లక్షల మంది పేదలకు పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్లు కేటాయిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి రబినారాయణ నాయక్ చెప్పారు. సోమవారం రాత్రి భువనేశ్వర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఒక తండ్రి సంతానమైన కొడుకులు వేరు కాపురాలు పెట్టుకొని ఉన్నా పథకం అమలవుతుందన్నారు. తండ్రి నుంచి వేరైనట్లు ఆధారాలున్నవారంతా ఈ పథకం కింద ఇళ్లు పొందడానికి అర్హులన్నారు. దరఖాస్తులు దాఖలు చేసుకున్న తరువాత అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తారన్నారు. గత ప్రభుత్వం లబ్ధిదారుల గుర్తింపు సక్రమంగా చేయలేదని, అనర్హులకు ఇళ్లు కేటాయించినందున కొన్నాళ్లు రాష్ట్రంలో ఈ పథకం నిలిచిపోయిన సంగతిని మంత్రి గుర్తు చేశారు. కేంద్ర నిబంధనల ప్రకారం దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు దిగువనున్న వారందరికీ గృహాలు మంజూరు చేస్తామని, త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

హబిషార్థులు దరఖాస్తు చేసుకోండి

14 నుంచి కార్తిక సేవలు, రాధాదామోదర వ్రతాలు



పూరీ పురుషోత్తముడు

గోపాలపూర్, న్యూస్‌టుడే: రథయాత్ర వేడుకల తరువాత పూరీ శ్రీక్షేత్రంలో ఈ నెల 14 (ఏకాదశి) నుంచి జగన్నాథుని రాధాదామోదర వ్రతాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు నవంబరు 11 (కార్తిక శుక్ల దశమి) వరకు కొనసాగుతాయి. 12 నుంచి 15 (కార్తిక పౌర్ణమి) వరకు పొంచుక వ్రతాలు నిర్వహిస్తారు. నెల రోజులు రాధాదామోదర రూపంలో దర్శనమిచ్చే స్వామి పొంచుకలో లక్ష్మీనారాయణ, త్రివిక్రమ, లక్ష్మీనృసింహ, వామన, రాజరాజేశ్వరునిగా అలరిస్తాడు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతారు. రాధాదామోదర వ్రతాలు చేపట్టే హబిషార్థులు (దీక్షాధారులైన మహిళలు) నెల రోజులు పూరీలో ఉంటారు.

ఉచిత వసతి, తీర్థ ప్రసాదాలు



సిద్ధార్థ్‌శంకర్ స్వయిన్

కార్తిక వ్రతాలు చేయడానికి మహిళలు పెద్ద సంఖ్యలో పూరీ వస్తారు. ప్రభుత్వం వీరికి ఉచిత వసతి, తీర్థ ప్రసాదాలు, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించనుంది. పూరీ పాలనాధికారి సిద్ధార్థ్ శంకర స్వయిన్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు నీలాద్రి భక్త నివాస్, జగన్నాథ వల్లభ కల్యాణ మండపం, మున్సిపల్ అతిథిభవనాల్లో వసతి కల్పిస్తామన్నారు. నిత్యం పూరీ ఒబడా ప్రసాదాలు రెండు పూటలా అందిస్తామన్నారు. వైద్యులు నిత్యం వసతి గృహాల వద్దకొచ్చి హబిషార్థులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ప్రతిరోజు శ్రీక్షేత్ర దర్శనానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. మహిళలు తాముంటున్న గృహాల నుంచి బస్సుల్లో వెళ్లి జగన్నాథునికి పూజలు చేసి మళ్లీ బస్సుల్లో వెళతారని వివరించారు. ఈ నేపథ్యంలో తమ వివరాలు, ఆధార్ కార్డు నకలుతో పాలనాధికారి కార్యాలయం, శ్రీక్షేత్రం, పూరీ చిరునామాకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు ఉంటుందని, గుర్తింపు పొందిన వారికే ఉచిత సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు.

13 కి.మీ. మేర నిలిచిపోయిన వాహనాలు

నాలుగు రోజులుగా అవస్థలు



ట్రాఫిక్ కారణంగా చిక్కుకున్న అంబులెన్స్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: గత నాలుగు రోజులుగా వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో మయూర్‌భంజ్ జిల్లాలో చోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. రహదారిపై 13 కి.మీ. మేర వాహనాలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలందించే అంబులెన్స్‌లు ముందుకు వెళ్లలేక రోగులు అవస్థలు పడుతున్నారు. ఘాట్ రహదారిపై బారులు తీరిన వాహనాల్లో కొన్ని నిత్యావసర సరకులను తరలించే ట్రక్కులు కూడా ఉన్నాయి. జాతీయ రహదారి (ఎన్‌హెచ్-49)లోని బంగిరిపోసి ఘాట్ రహదారిపై మూడు వాహనాలు మరమ్మతులకు గురవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు స్థానికులు, చోదకులు చెబుతున్నారు. దీనికి సంబంధించి వీడియోలను ఓ నెటిజన్ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేయడంతో పరిస్థితి వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న బంగిరిపోసి, బిజోయ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించారు. రెండేసి గంటల వ్యవధిలో కొన్ని భారీ వాహనాలకు మాత్రమే అనుమతిస్తున్నారు. మరమ్మతులకు గురైన ట్రక్కుల వద్దకు క్రేన్ చేరుకోవడంలో తలెత్తిన ఇబ్బందులే ఇంతలా వాహనాలు నిలిచిపోవడానికి కారణమని పోలీసులు తెలిపారు.



ఘాట్ రహదారిపై బారులు తీరిన వాహనాలు

కొరాపుట్‌వాసికి అరుదైన అవకాశం



రోహిత్‌కుమార్ పాత్రో

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్ యువకుడు రోహిత్ పాత్రో దక్షిణాఫ్రికా సన్‌సిటీలో జరగనున్న కామన్వెల్త్ ఎక్విప్‌డ్, క్లాసిక్ జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీలలో పాల్గొనే అరుదైన అవకాశం పొందాడు. ఆయనకు జిల్లా వాసులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ పోటీలు అక్టోబరు 4 నుంచి 13 వరకు జరగనున్నాయి.

బ్యాడ్మింటన్ పోటీల్లో అవినాష్, ఆయుష్‌లకు కాంస్యం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఉగండాలోని కంపాలలో లుగోగో ఇండోర్ మైదానంలో గత నెల 26వ తేదీ నుంచి 29 వరకు జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు అవినాష్ మహంతి, ఆయుష్ పట్నాయక్ కాంస్య పతకం దక్కించుకున్నారు. వీరు సెమీఫైనల్స్‌లో మలేషియా క్రీడాకారులు అష్రఫ్ డేనియల్ మహమ్మద్ జకరియ, ఎం.అరిఫిన్ నజ్రి మహమ్మద్ జకరియలతో ఆడి ఓడిపోయారు. దీంతో తృతీయస్థానంలో నిలిచి కాంస్యపతకం గెలుచుకున్నారు.



పతకాలు, ప్రశంసాపత్రాలతో అవినాష్, ఆయుష్



జెండా ఊపి ప్రారంభిస్తున్న పరుల్ పట్వారీ, తదితరులు

సంజీవిని సంచార ఆసుపత్రి ఏర్పాటు

రాయగడ, న్యూస్‌టుడే : భారతీయ స్టేట్ బ్యాంకు వారు నిర్వహిస్తున్న సామాజిక బాధ్యత కార్యకలాపాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సంజీవిని సంచార ఆసుపత్రితో గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని పాలనాధికారి పరుల్ పట్వారీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ పథకం సమన్వయకర్త బిష్ణు చరణ్‌పండా మాట్లాడుతూ ఎస్‌బీఐ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఈ సంచార ఆసుపత్రి జిల్లాలో 15 నెలలు పని చేస్తుందన్నారు. మొదట బిసం కటక్ సమితిలో తదుపరి పరిసర 10 గ్రామాల్లోను, కె. సింగపూర్ సమితి పార్సలి సమీప 10 గ్రామాల్లో సేవలందించనున్నారు. ఈ సంచార ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు చేసి మందులు అందజేస్తారని తెలిపారు. అదనపు కలెక్టర్ భాస్కర్ చంద్ర రైత, జిల్లా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోటి కుటుంబాలకు ఆరోగ్యకార్డులు: మహాలింగ



భువనేశ్వర్, న్యూస్‌టుడే: కొద్దిరోజుల్లో రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం అమలు కానుందని, దీంతో పాటు గోపబంధు ఆరోగ్య పథకం కూడా ప్రారంభించనున్నామని ఆరోగ్యశాఖ మంత్రి ముఖేష్‌మహాలింగ చెప్పారు. మంగళవారం సాయంత్రం భువనేశ్వర్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆయుష్మాన్ కింద 67 లక్షలు, గోపబంధు పథకం ద్వారా 33 లక్షల కుటుంబాలకు ఉచిత వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. దేశంలోని 27 వేల ప్రముఖ ఆసుపత్రుల్లో ఉచిత సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఆయుష్మాన్ కేంద్ర పథకం కాగా గోపబంధు కార్యక్రమం రాష్ట్రప్రభుత్వానిది. బిజద పాలకులు లోగడ బిజుపట్నాయక్ స్వాస్థ కళ్యాణయోజన ప్రారంభించారు. ప్రస్తుత మోహన్‌చరణ్‌మాఝి ప్రభుత్వందీని పేరును గోపబంధుగా మార్చింది. పురుషులకు ఏడాదిలో రూ.5 లక్షలు, మహిళలకు రూ.10 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందుబాటులో ఉన్న సంగతి తెలిసిందే. ఆయుష్మాన్ కింద కేంద్రం రూ.5 లక్షల వరకు కేటాయిస్తుంది.

డీపీ క్యాంప్ సమస్యల పరిష్కారానికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక సంస్థ పరిధిలో డీపీ క్యాంప్‌లో నివాసముంటున్న బెంగాలీ శరణార్థులకు సమస్యలు వెంటాడుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. పారిశుద్ధ్యం లోపించింది. విద్యుత్తు దీపాలు లేక రాత్రివేళ అంధకారం అలముకుంటోంది. ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు సంబంధిత శాఖను కోరారు. స్పందించిన పుర అధ్యక్షుడు రాజేంద్ర మంగళవారం ఉదయం డీపీ క్యాంపులో పర్యటించి సమస్యలను పరిశీలించారు. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసిస్టెంట్ ఇంజినీర్ మనోజ్ పాత్ర, కౌన్సిలర్ రవీంద్ర కుమార్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలు పరిశీలిస్తున్న రాజేంద్ర, మనోజ్‌లు

ముగ్గురు సువార్ సేవాయత్‌లపై చర్యలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాఢి మంగళవారం సాయంత్రం ముగ్గురు సువార్‌సేవాయత్‌లపై చర్యలు తీసుకున్నారు. ఇటీవల వీరు మహాలక్ష్మి పాకశాలలో మట్టి కుండలకు బదులుగా ఇనుపపాత్రలో ఒబడా (మహాప్రసాదం) వండినట్లు ఆరోపణలొచ్చాయి. దర్యాప్తులో ఈ విషయం వాస్తవమని తేలడంతో తీవ్రమైన అంశంగా యంత్రాంగం పరిగణించారు. శ్రీక్షేత్రంలో జగన్నాథునికి అర్పణయ్యే ప్రసాదాలన్నీ మట్టి పాత్రల్లో వండుతారు. నైవేద్యమైన తర్వాత భక్తులకు మట్టికుండల్లోనే విక్రయిస్తారు. దీన్ని వ్యతిరేకించిన ముగ్గురు సేవాయత్‌లో ఇనుపపాత్రలో వండి తోటి సేవాయత్‌ల దృష్టిలో పడ్డారు. వారంతా ఆగ్రహం వ్యక్తం చేసి పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేయించి చర్యలు తీసుకున్నారు.



కార్డుకు సంబంధించి వివరాలను తల్లిదండ్రులకు తెలియజేస్తున్న ప్రధాన ఆచార్యులు

విశ్వవిద్యాలయంలో 'అపార్'పై సమావేశం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం విక్రమ్‌దేవ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) గుర్తింపు కార్డుకు సంబంధించి సమీక్ష సమావేశం జరిగింది. ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లితండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా 137 మంది పత్రాలు నింపారు. ఈ ప్రక్రియ తర్వాత ప్రత్యేక ఐడీతో పాటు డిజీ లాకర్ తెరవడుతుందని ప్రధాన ఆచార్యులు డా. లక్ష్మణ్ పాత్రో తెలిపారు.

జాతీయ పోటీల్లో మరో ఇద్దరికి పతకాలు



పసిడి పతకంతో జస్పీర్ నాయక్



రజత పతకంతో మేరీముక్తా సొరెన్

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బిహార్‌లో జరుగుతున్న నాలుగో జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో సోమవారం నిర్వహించిన పలు అంశాల్లో మరో ఇద్దరు రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈమేరకు రాష్ట్ర క్రీడావిభాగం 'ఎక్స్'లో ఆ వివరాలు వెల్లడించింది. పోటీల్లో పురుషుల విభాగంలో జస్పీర్ నాయక్ డెకథ్లాన్‌లో పసిడి పతకం దక్కించుకున్నారు. ఆయన 7065 పాయింట్లతో కొత్త మీట్ రికార్డు నెలకొల్పినట్లు క్రీడా శాఖ పేర్కొంది. మహిళా విభాగంలో మేరీముక్తా సొరెన్ ట్రిపుల్ జంప్ పోటీలో ద్వితీయస్థానంలో నిలిచి రజత పతకం గెలుచుకుంది.

ప్రతిభ చూపిన బొలంగీర్ జట్టు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో గత నెల 29 నుంచి మంగళవారం వరకు జరిగిన రెండో ఒడిశా అంతర్‌జిల్లా లాన్‌బాల్ పోటీల్లో సోమవారం నిర్వహించిన పలు విభాగాల్లో బొలంగీర్ జిల్లా జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచి అయిదు పసిడి పతకాలు గెలుచుకుంది. ఢెంకనాల్ జిల్లా జట్టు రెండు రజత, సంబల్‌పూర్ జట్టు క్రీడాకారులు మూడు కాంస్య పతకాలు కైవశం చేసుకున్నారు.



బంతిని విసురుతున్న క్రీడాకారులు

మంగళవారం వివిధ జిల్లాల పురుషుల, మహిళా క్రీడాకారుల మధ్య తుదిపోరు జరిగింది.

ఒప్పంద ఉద్యోగులుగా నియామకాలు

రాయగడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకొన్న నిరుద్యోగుల ఆశలు నెరవేరాయి. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసేందుకు 511 మందికి నియామక ఒప్పంద పత్రాలు అందజేశారు. మంగళవారం గోవింద చంద్రదేవ్ జిల్లా ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఆరు సంవత్సరాల పాటు ఒప్పంద ఉద్యోగులుగా పని చేయాల్సి ఉంటుంది. మొదటి మూడేళ్లు నెలకు రూ. 11,100 ఆ తర్వాత రూ. 20,000 వేలు జీతం అందించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బసంత్ కుమార్ నాయక్ తెలిపారు. వీరిని ప్రత్యేక బస్సుల్లో భువనేశ్వర్ తీసుకుని వెళ్లి శనివారం జరిగే కార్యక్రమంలో ముఖ్య మంత్రి మోహన్ చరణ్ మాఝి నియామక పత్రాలు అందించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా పాలనాధికారి పరుల్ పట్వారీ చెప్పారు.

'సంకల్ప' పథకం కింద శిక్షణ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'ధార్వి ఎడ్యుకేషన్, ఇన్నోవేటివ్ సొసైటీ (ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి) ఆధ్వర్యంలో స్థానిక టీఎన్‌టీ స్కిల్ కేంద్రంలో 'సంకల్ప' పథకం కింద విద్యార్థులకు 'నేషనల్ లైఫ్ సేవియర్ ఫోర్స్' శిక్షణ శిబిరం జరుగుతోంది. ఐదు రోజుల ఉచితం శిక్షణ అనంతరం పాల్గొన్న వారికి ధ్రువపత్రం, కిట్‌లు అందజేస్తామని సంస్థ ప్రతినిధులు పి. నీలిమ, పి. బి. ఎస్. చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ శిబిరంలో టీఎన్‌టీ స్కిల్ కేంద్రం ప్రతినిధులు అజయ్, పూర్ణచంద్ర నాయుడు, ఈశ్వర్‌లు పాల్గొంటున్నారని వారు పేర్కొన్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



వైద్యులతో మాట్లాడుతున్న శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రాహి

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి గురండి గ్రామంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో శాసనసభ్యుడు రూపేష్ పాణిగ్రాహి పాల్గొన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అందుతున్న సేవలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యం అందించడంలో నిర్లక్ష్యం చూపద్దని, రోగులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయనతో సమితి అభివృద్ధి అధికారి గౌర చంద్ర పట్నాయక్ ఉన్నారు.

నేటి నుంచి అమ్మవారికి సున్నాభెషో అలంకరణ

రాయగడ, న్యూస్‌టుడే: ఉత్కళ, ఆంధ్రుల ఇలవేల్పుగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులచే పూజలందుకుంటున్న మజ్జిగౌరీ అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నుంచి సున్నాభెషో (బంగారు ఆభరణాలు) అలంకరణ చేయనున్నారు. మంగళవారం జిల్లా ఉపఖజానాలో భద్రపరిచిన నగలను ఆలయ ట్రస్టు అధ్యక్షుడు రాయిసింగ్ బిడిక, ట్రస్టు సభ్యులు ఇప్పిలి సన్యాసి రాజు, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు ఆలయానికి తీసుకువచ్చారు. తొమ్మిది రోజుల పాటు భక్తులకు స్వర్ణఆభరణాలతో దర్శనమివ్వనున్నారు.



బంగారు ఆభరణాలను తలపై పెట్టుకొని తెస్తున్న బిడిక, పక్కన ట్రస్టు సభ్యులు

కొరవడిన పారిశుద్ధ్యం



సమితి ఉద్యోగుల వసతి గృహం ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ప్రజల్లో అవగాహన కల్పించి కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెప్టెంబరు 15వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నందపూర్‌లోని సమితి కేంద్రానికి సంబంధించిన ఉద్యోగుల వసతి గృహంలో ఈ స్వచ్ఛత లోపించింది. ఆవరణంలో చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు దీనిపై దృష్టి పెట్టకపోతే ప్రజల్లో చైతన్యం ఎలా కలిగిస్తారని సర్వత్ర నిరసన వ్యక్తం అవుతోంది.

ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన లారీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పరిధిలోని 16వ నెంబరు జాతీయ రహదారిపై బెజిపుట్ వంతెన సమీపాన మంగళవారం ఉదయం ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు చోదకుడు, సహాయకుడు, మరో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని స్థానికులు అంబులెన్స్‌లో కళ్లికోట ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

152 మందిని కాటేసిన పాములు

ఖరగ్‌పూర్ న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన వర్షాలకు పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా ఘటాల్, చంద్రకోణా, దాస్‌పూర్, కేస్‌పూర్, దేబ్రా తదితర ప్రాంతాల్లో వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ వరదల ధాటికి బాధితులంతా నిరాశ్రయులయ్యారు. దీంతో పాటు పాముల కాటుకు 152 మంది గురయ్యారు. సమీపంలో ఉన్న వైద్య కేంద్రానికి వెళ్లి చికిత్స తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయాన్ని జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సౌమ్య శంకర్ షాడంగి తెలిపారు.

మహిళ మెడలో గొలుసు దోపిడీకి యత్నం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ మహిళ మెడలో బంగారు గొలుసు దోపిడీకి దుండగుడు ప్రయత్నించాడు. ఈ ఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. ఐఐసీ కమలాకాంత్ కొహర్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. స్థానిక నెహ్రూనగర్ రెండో లైనులో నివాసముంటున్న ఎం. హరిప్రసాద్ భార్య ఎం. రజని ఉదయం 6 గంటలకు ఇంటి ఎదుట శుభ్రపరుస్తోంది. ఆమె మెడలో బంగారు గొలుసును లాక్కుపోయేందుకు ఓ దుండగుడు ప్రయత్నించాడు. రజని ప్రతిఘటించడంతో దుండగుడు పరారయ్యాడు. ఈ పెనుగులాటలో బాధితురాలికి స్వల్ప గాయాలయ్యాయి. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించామని, నిందితుడిని వీలైనంత త్వరగా పట్టుకుంటామని కమలాకాంత్ పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవకారాగార శిక్ష

జయపురం, న్యూస్‌టుడే: వ్యాపారిని బెదిరించి, హత్య చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. జయపురం అదనపు న్యాయమూర్తి బిద్యాధర్ పృష్టి సాక్ష్యాధారాలు అనుకూలంగా శిక్ష విధించారు. న్యాయవాది సుధీర్ త్రిపాఠి తెలిపిన వివరాలు ప్రకారం.. బొయిపరిగూడ సమితి దండబాడి పంచాయతీ కదలిపొదర గ్రామానికి చెందిన వ్యాపారి త్రినాథ్ హొతా వద్ద 2019 మార్చిలో ఆదే గ్రామానికి చెందిన ముకుశాంటా సరకులు కొనుగోలు చేశారు. నెల గడిచినా డబ్బులు ఇవ్వలేదు. ఏప్రిల్ 1వ తేదీన డబ్బులు అడిగితే చంపేస్తానని ముకు త్రినాథ్‌ను బెదిరించాడు. 2న ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం న్యాయమూర్తి 11మంది సాక్షుల వాంగ్మూలం ఆధారంగా తుది తీర్పు ప్రకటించారు.

నూతన కార్యవర్గానికి ఎంపికలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదివాసీల హక్కుల కోసం పోరాడుతున్న కొరాపుటియ జన సురక్ష సంఘం నూతన కార్యవర్గం ఎంపిక మంగళవారం జరిగింది. ఈ మేరకు జానిగుడలో జరిగిన కార్యక్రమంలో వివిధ ఆదివాసీ సంఘాల నేతలు పాల్గొన్నారు. అధ్యక్షుడిగా దాసినందివాలి, ఉపాధ్యక్షులుగా తిలక్ గుంజియా, త్రిలోచన్ ముదిలి, కార్యదర్శిగా జీసుదాస్ దిసరి తదితరులు ఎంపికయ్యారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణంలోని నింపురా ప్రాంతంలోని శ్రీ కనకదుర్గ మలేశ్వర ఆలయంలో ఈ నెల మూడోవ తేదీ నుంచి 12 వరకు దుర్గాశరన్నవరాత్రులు వేడుకలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రకటించింది. ఇందులో భాగంగా 3న కలశ ప్రతిష్ఠ, ఎనిమిదో తేదీన సామూహిక కుంకుమార్చనలు, పదోతేదీన పూలంగి సేవ, 12న పూర్ణాహుతి ప్రత్యేక కార్యక్రమాలు చేస్తామని అర్చకుడు స్వామి పాత్రుని ధర్మయ్య శాస్త్రి తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: మిడ్నాపూర్ సోషల్ వెల్ఫేర్ ఫోరం, అఖిలభారత వివేకానంద యువ మండల్ సంయుక్తంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సంస్థల 20వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఝార్‌గ్రామ్ జిల్లా కంకరాజోల్, ఆమ్లాసోల్ మారుమూల ఆదివాసీ గ్రామాలకు సంస్థ సభ్యులు వెళ్లి 240 మందికి వీటిని అందజేశారు.

పౌష్టికాహార వారోత్సవాలు ప్రారంభం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం స్వామినాథన్ ఫౌండేషన్‌లో పౌష్టికాహార వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. డైరెక్టర్ ప్రశాంత్ పరిడా అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా అదనపు పాలనాధికారి రాజ్‌కిషోర్ దాస్, అటవీ అధికారి ప్రతాప్‌కుమార్ బెహరా, శాస్త్రవేత్త డా. కార్తీక్ చరణ్ లెంకా, మత్స్య శాఖాధికారి త్రివేణి పాత్ర, సంక్షేమ అధికారి బైశాలి దొర తదితరులు పాల్గొన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటామని గ్రామస్థులకు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్ పరిడా

బ్రహ్మపుర రహదారుల్లో పరిస్థితి చక్కదిద్దాలి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంస్థ (బీఈఎంసీ) పరిధిలోని రహదారుల్లో ప్రజలు, వాహనాలు సజావుగా రాకపోకలు సాగించేలా పరిస్థితిని చక్కదిద్దాలని కన్హా చారిటబుల్ ట్రస్ట్ కోరింది. మంగళవారం ట్రస్ట్ అధ్యక్షురాలు రంజనా మిశ్ర నాయకత్వంలో పలువురు ప్రతినిధులు బీఈఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్ మిశ్రను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్య అంతకంతకూ అధికమవుతోందని, ప్రధాన రహదారుల్లో తోపుడు బళ్ల వ్యాపారుల వల్ల రహదారులు కుచించుకుపోతున్నాయని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.



బీఈఎంసీ కమిషనర్ మిశ్రకు వినతిపత్రం అందజేసిన ట్రస్ట్ ప్రతినిధులు

బొలంగీర్‌లో ఇండో-అమెరికా సంస్థ సేవా కార్యక్రమాలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బొలంగీర్ జిల్లాలో ఇండో-అమెరికా సేవా సంస్థ వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనుంది. మంగళవారం ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, బొలంగీర్ ఎంపీ సంగీతా కుమారీ సింగ్‌దేవ్ సమక్షంలో ఈమేరకు ఒప్పందం కుదిరింది. కార్యక్రమంలో కనకవర్ధన్ మాట్లాడుతూ... పాడిపంటలు, మత్స్య సంపదకు సంబంధించి రైతులకు సంస్థ అవగాహన కల్పిస్తుందన్నారు. బొలంగీర్‌లో పత్తి ఉత్పత్తి ఎక్కువ. దీని అమ్మకాలకు సౌకర్యాలు కల్పించే బాధ్యతను కూడా సంస్థ చేపడుతుంది.



కార్యక్రమంలో దీపం వెలిగిస్తున్న సింగ్‌దేవ్. పక్కన సంగీతా తదితరులు

వృద్ధులను గౌరవించాలి



వృద్ధుడికి జ్ఞాపికను అందజేస్తున్న పాలనాధికారి బిజయ్ కుమార్ దాస్

నవరంగపూర్, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లాలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం కార్యక్రమం మంగళవారం జరిగింది. ★ పర్లాఖెముండి పట్టణంలోని బిజు కల్యాణ మండపంలో జిల్లా సామాజిక భద్రత, వికలాంగుల సాధికారితశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించి వృద్ధులను పరీక్షించి, మందులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వృద్ధులను గౌరవించాలని కోరారు. అనంతరం వృద్ధులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎంఎం అలీ, అదనపు సామాజిక భద్రత శాఖ అధికారిణి ఉచ్చ్రగిత బోడోరైత్ తదితరులు పాల్గొన్నారు. ★ రాయగడ పట్టణం: వయసు మీదపడ్డ వయోజనులు మరింత ఆరోగ్యకర జీవితాన్ని గడిపేందుకు మంచి ఆహారంతో పాటు సానుకూల దృక్పథంతో మెలగాలని సమితి అధ్యక్షురాలు టుని హుయిక అన్నారు.

స్వచ్ఛతా హీ సేవా ప్రచార ర్యాలీ



ర్యాలీలో జిల్లా పాలనాధికారి వి.కీర్తివాసన్ తదితరులు

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా ప్రచార సైకిల్ ర్యాలీ జరిగింది. పాలనాధికారి వి కీర్తివాసన్ పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని ఆమె అన్నారు.

సిమిలిగుడ, న్యూస్‌టుడే: దమన్ జోడి నాల్కో ఆధ్వర్యంలో గత 15 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా కార్యక్రమం చివరి రోజు మంగళవారం భారీ ఎత్తున నిర్వహించారు. నాల్కో కార్యనిర్వాహక సంచాలకులు నిరంజన్ బెహరా నేతృత్వంలో జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులంతా కలిసి మతల్‌పుట్ బస్టాండ్ వద్ద, నాల్కో గనుల ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించారు.

నవరంగపూర్‌లో 176 అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభం

నవరంగపూర్, న్యూస్‌టుడే: కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సోమవారం దేశంలో 11వేల అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో నవరంగపూర్ జిల్లాలో 176 కేంద్రాలను మంత్రి నిత్యానందగండ్ మంగళవారం ప్రారంభించారు. పిల్లలకు బాల్యం నుంచి విద్య, పౌష్టికాహారం ఇవ్వాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం కేంద్రప్రభుత్వం చేపట్టినట్టు మంత్రి పేర్కొన్నారు. పాలనాధికారి శుభంకర్ మహాపాత్ర్ పాల్గొన్నారు.

స్నిగ్ధ రాణికు జాతీయ పురస్కారం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా సంఘసేవకురాలు స్నిగ్ధ రాణి మిశ్రాకు జాతీయ పురస్కారం లభించింది. ఫెడరేషన్ ఆఫ్ బ్లడ్ డోనర్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ఇండియా, నేషనల్ తలసేమియా వెల్ఫేర్ సొసైటీలు సంయుక్తంగా దిల్లీలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా సదస్సు ఏర్పాటు చేశారు. రక్తదాతలకు అవార్డులు అందజేశారు. ఒడిశా రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ ప్రాంతానికి చెందిన స్నిగ్ధ రాణి మిశ్రా 50 సార్లు రక్తదానం చేయడంతో పాటు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సేవలకుగాను ఆమెకు జాతీయ పురస్కారం అందజేశారు. ఎస్టీ కమిషన్ ఛైర్మన్ హంస రాజ్ అహిర్, బ్లడ్ ఫెడరేషన్ అధ్యక్షురాలు అప్రభా గోస్ ఈ అవార్డు అందించారు.



అవార్డు అందుకుంటున్న స్నిగ్ధ

జిల్లా వారికి అవకాశమివ్వాలి

రాయగడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినప్పటికి రాయగడలో ఇతర జిల్లాల వారిని నియమించడం పట్ల స్థానిక నిరుద్యోగులు ఆందోళన చేపట్టారు. మంగళవారం గోవింద చంద్ర దేవ్ జిల్లా ఉన్నత పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. రాయగడ సమితి ఉపాధ్యక్షుడు హర ప్రసాద్ హెప్రిక అధ్యకతన ఈ ఆందోళన జరిగింది.



గోవింద చంద్ర దేవ్ జిల్లా ఉన్నత పాఠశాల వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ అభ్యర్థులు

జయపురం, కొరాపుట్ న్యూస్‌టుడే: జిల్లాల వారీగా ఉద్యోగ నియామకం కోసం డిమాండ్ చేస్తూ అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో(ఏబీకే)లో కాంగ్రెస్ తరపున ఈనెల 4వ తేదీన బంద్‌కు పిలుపునిచ్చారు. ఈమేరకు జయపురంలో జిల్లా కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు సందీప్ సామంత్రాయ్ అధ్యక్షతనలో మంగళవారం విలేకర్ల సమావేశం జరిగింది. ★ కొరాపుట్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ శాఖల్లో స్థానికులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బంద్‌కి పిలుపునిచ్చినట్లు తెలిపారు.

రక్తదాతలకు సత్కారం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లా రక్తదాతల సంఘం ఆధ్వర్యంలో సునాబెడ కల్యాణమండపంలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. పురాధ్యక్షులు రాజేంద్ర కుమార్ పాత్రో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తదాతల సంఘం అధ్యక్షుడు సంజీవ్ కుమార్ అధ్యక్షతన కార్యదర్శి షేక్ ఇబ్రహీం, ప్రతినిధులు ఉమాపాత్ర, దుర్గా పాత్ర, చింతామణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గతేడాది చేసే దాతలను, శిబిరాలు నిర్వహించే సంస్థల ప్రతినిధులను సత్కరించారు.

పర్లాఖెముండి: పర్లాఖెముండి పట్టణంలోని శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాలలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానాచార్యులు జితేంద్ర నాథ్ పట్నాయక్ ఉన్నారు.



సహృదపర్వనాకు సత్కారం

విశాఖ ఉక్కు పరిరక్షణకు దీక్ష

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అని విద్యార్థి సంఘాల నాయకులు దీక్షలు చేపట్టారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు శిబిరాన్ని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి ప్రారంభించారు. ఉత్తరాంధ్రకు తలమానికంగా ఉన్న ఉక్కు పరిశ్రమలో ఉద్యోగులను తొలగించడం సరికాదన్నారు. ఒకేసారి 4 వేల మంది ఉద్యోగులను తొలగిస్తే కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు ఆర్.వేణు, కె.మన్మథరావు, జీవన్న, ఇందిర, డి.పండు, బి.రవికుమార్, ఎం.వెంకటరమణ, బి.టి.నాయుడు, సి.హెచ్.సింహాచలం, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో కూర్చున్న విద్యార్థి సంఘం నాయకులు

శరన్నవరాత్రి మహోత్సవాలు

మక్కువ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ ఆలయంలో ఈనెల 3నుంచి 12వరకు దేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాణిజ్య పంటలతో రైతుకు మేలు

భామిని, న్యూస్‌టుడే: పత్తి పంటలో పలు రకాల వాణిజ్య పంటలు పండిస్తే రైతు అదనపు ఆదాయం పొందొచ్చని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రిసోర్సు పర్సన్ సర్వ దేవుళ్లు తెలిపారు. మండలంలోని వాసన్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తనలో భాగంగా సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న పంటలు పరిశీలించారు. 10 రకాల పప్పు దినుసులు, పెసలు, మినుములు, జొన్న, మొక్కజొన్న, నువ్వులు, కొర్రలు, బెండ, కంది, ఆముదాం, చిక్కుళ్లు తదితర పంటల సాగు విధానం గురించి వివరించారు.


రైతులకు మెలకువలు చెబుతున్న సర్వదేవుళ్లు

మూడు నుంచి పోలమాంబ ఉత్సవాలు



పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణం నాగవంశంవీధి కూడలిలోని పురటాల పోలమాంబ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు దేవాలయ భక్తబృంద సభ్యులు తెలిపారు. పది రోజులపాటు వీధి సంబరాలు, సహస్ర కుంకుమార్చనలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రహదారి పొడవునా విద్యుత్తు దీపాలంకరణ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన భామిని ఆదర్శ పాఠశాల విద్యార్థులు

భామిని, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. వివిధ క్రీడల్లో జి.అభిరాం, జి.ఉదయ్ కుమార్, బి.ఓంకార్, శాంతికుమారి, దేవకి, వి.కార్తికేయ, శాంతికుమారి, దేవకి, బి.లావణ్య జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చారు. పాఠశాల పీడీ శివరాంప్రసాద్, శిక్షకుడు సోమేష్ విద్యార్థులను అభినందించారు.

78 రకాల పనులు గుర్తించాలి

వీరఘట్టం, న్యూస్‌టుడే: పంచాయతీ కేంద్రాల్లో బుధవారం నిర్వహించనున్న గ్రామసభల్లో 78 రకాల పనులు గుర్తించాలని ఉపాధి హామీ ఏపీడీ జి.శ్రీహరిరావు తెలిపారు. మంగళవారం నరేగా కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. వ్యవసాయం, అనుబంధ పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

చిన్నచూపు తగదు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వృద్ధులను ఆదరించాలే కానీ, వారిని చిన్నచూపు చూడడం తగదని పాలకొండకు చెందిన వైద్యనిపుణుడు ఏఏన్ పట్నాయక్ పేర్కొన్నారు. జగన్నాథస్వామి ఆలయ వీధిలోని బాలగోపాల లక్ష్మీనరసమ్మ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధుల దినోత్సవం నిర్వహించి అక్కడి వారిని సత్కరించారు. ఆశ్రమ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రమానంద్ తదితరులు ఉన్నారు.


వృద్ధున్ని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు


వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు

సీతంపేట, న్యూస్‌టుడే: వృద్ధులకు అక్టోబరు నెలలో ప్రత్యేకంగా వైద్యసేవలు అందిస్తామని సీతంపేట ప్రాంతీయాసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం జరిపారు. బీపీ, షుగర్, మానసిక ఆరోగ్య సమస్యలు, కళ్లు, ఫిజియోథెరపీ సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు.

రైతేరాజు

ఆదాయం అందించే కంది..!

న్యూస్‌టుడే, జలుమూరు


లింగాలవలస వద్ద కంది పంట

పప్పు దినుసుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న ప్రస్తుత రోజుల్లో కంది పంట వేస్తే రైతుకు ఆర్థికంగా కలిసి వస్తుందంటున్నారు జలుమూరు మండలం లింగాలవలస గ్రామానికి చెందిన రైతు రెడ్డి కృష్ణ. తనకు ఉన్న మెట్ట పొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో గత రెండేళ్లుగా కంది పండిస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వేసుకుంటే తక్కువ పెట్టుబడితో 180 రోజుల్లో పంట చేతికి అందుతుంది. 20 సెంట్ల విస్తీర్ణంలో విత్తనం దగ్గర నుంచి పంట చేతికి అందేవరకు రూ.2,500 వరకు ఖర్చవుతుంది. 175 కిలోల వరకు గింజలు వస్తాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో ధర రూ.70 ఉంది. పెట్టుబడి పోను రూ.10 వేల వరకు ఆదాయం ఉంటుందని రైతు తెలిపారు.

సాగు లాభదాయకమే: మెట్ట ప్రాంతంలో కంది పంట సాగు లాభదాయకమే. పెట్టుబడి చాలా తక్కువ. ఎరువులు, పురుగు మందులు అంతగా అవసరం ఉండదు. ఖరీఫ్‌లో సాగు చేస్తే నీటి తడుల అవసరం ఉండదు. గత రెండేళ్లుగా కంది పండించి వ్యాపారులకు, రైతు బజారుల్లో విక్రయించి ఆదాయం పొందుతున్నాను. –రెడ్డి కృష్ణ, రైతు లింగాలవలస



సస్య రక్షణ చర్యలు ఇలా..: ఎకరాకు 3 కిలోల విత్తనాలు వేసుకోవాలి. విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. మొక్కకి, మొక్కకి 20 సెం.మీ., వరుసకి వరుసకి 1 మీటరు దూరం ఉండేలా చూడాలి. దుక్కిలో 15 కిలోల యూరియా, 20 డీఏపీ వేయాలి. మొక్క దశలో ఆకు చుట్టూ పురుగు ఆశిస్తుంది. దాని నివారణకు క్లోరోఫైరీపాస్ లీటరు నీటికి 2 మి.లీ. మందు కలిపి పిచికారీ చేయాలి. పూత, పిందె దశలో కాయతొలుచు పురుగు ఆశిస్తుంది దాని నివారణకు ఎస్పేట్ పౌడర్ లీటరు నీటికి 2 గ్రాములు, క్లోరోఫైరీపాస్ లీటరు నీటికి 2 మి.లీ. కలిపి పిచికారీ చేస్తే మంచిదని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు.

కాయదొలుచు పురుగును నివారిస్తే మంచి దిగుబడి


పొలంలో మొక్కజొన్నను ఆశించిన కాయదొలుచు పురుగు

సారవకోట, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో కాయదొలుచు పురుగును నివారిస్తే మంచి దిగుబడి వస్తుందని ఏవో కేవీహెచ్.వెంకటరావు తెలిపారు. ఏడాది పొడవునా మొక్కజొన్న సాగు చేయవచ్చునన్నారు. ఎకరాకు 8 కిలోల విత్తనాలు సరిపోతాయని, చివరి దుక్కిలో 50 కిలోల డీఏపీ, 20 కిలోల చొప్పున యూరియా, పొటాష్ ఎరువులు వేయాలన్నారు. పంట కాలంలో 3 నుంచి 4 సార్లు 35 కిలోల చొప్పున యూరియా వేసుకుంటే సరిపోతుందన్నారు. పైరుకు పురుగు సోకకుండా రెండు, మూడు సార్లు 750 మి.లీ. చొప్పున వేపనూనె పిచికారీ చేసుకోవాలని, కాయదొలుచు పురుగు ఆశిస్తే ఇమామెక్టిన్ బెంజియేట్ 100 గ్రాముల మందుతో పాటు 750 మి.లీ. వేపనూనె కలిపి 200 లీటర్ల నీటిని పిచికారీ చేసి నివారించుకోవాలని ఆయన సూచించారు.

రైతులు పండించే పంటల్లో ఎరువుల వినియోగం, కలుపు నివారణ, సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమదాలవలస కేవీకే సస్యపోషణ శాస్త్రవేత్త ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిలా ఇచ్చారు. –న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పంటల్లో కలుపు.. నివారణ చర్యలు



సమస్య: ఖరీఫ్ వరి సాగులో తెల్లదోమ దుబ్బుల దగ్గర కనిపిస్తోంది. దీని వల్ల మొక్కలు ఎండిపోయినట్లు అయిపోతున్నాయి. దీని నివారణకు చర్యలు తెలపండి
- ఎస్.రాములు, పారాపురం, కొత్తూరు

సమాధానం: దుబ్బులు దగ్గర తెల్లదోమ ఆశిస్తే మొక్క నుంచి రసాన్ని పీల్చేస్తాయి. దీని నివారణకు ఇమెడాక్లోప్రేడ్, ఎసిఫేట్ మందు 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మొదలు తడిసేలా పిచికారీ చేయాలి.

? : చెరకు పంటలో తీగ జాతి కలుపు మొక్కలు అధికంగా ఉన్నాయి. వీటి నివారణకు చర్యలు తెలపండి.
- ఎస్.నారాయణరావు, కొత్తవలస,ఆమదాలవలస

●: చెరకు పంటలో తీగజాతి కలుపు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు ఆల్‌మిక్స్ 8 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేస్తే కలుపు మొక్కల్ని అరికట్టడంతో పాటు అధిక దిగుబడులు పొందేందుకు అవకాశం ఉంటుంది.

? : పత్తిలో ఆకుల కింద భాగంలో తెల్లదోమ అధికంగా కనిపిస్తుంది. దీని వల్ల మొక్కలు గిడసబారిపోవడంతో పాటు ఆకుల పరిణామం తగ్గిపోతోంది. నివారణకు చర్యలు తెలపండి.
–కె.అప్పలనాయుడు, మురపాక, లావేరు మండలం

● : తెల్ల దోమ ఆకుల కింద భాగం నుంచి రసాన్ని పీల్చేస్తుంది. దీంతో మొక్కలు గిడసబారిపోయి, ఆకుల పరిమాణం తగ్గిపోయి రంగు మారిపోతాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లేదా అసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా టయామితగ్జోమ్ 0.2 గ్రాముల మందు ఏదో ఒకటి మార్పు చేసుకుంటూ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేస్తే నివారించవచ్చు.

యాజమాన్య విధానాలతో సుడిదోమ దూరం


సుడిదోమ పోటుకు గురైన వరి పంట

జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వేసే వరి పంటలో రైతులు యాజమాన్య విధానాలు పాటిస్తే సుడిదోమ, ఇతర చీడ పీడల నుంచి రక్షించుకోవచ్చని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. నాట్లు వేసేటప్పుడు తూరు, పడమర దిశలుగా కాలి బాటలు తీసుకోవాలి. ప్రతి 2 మీటర్లకు 20 సెం.మీ. కాలిబాట అవసరం. గాలి, వెలుతురు మొక్కకు సమృద్ధిగా అందడంతో పాటు చీడపీడలు దరి చేరవు. తెల్లదోమ వ్యాపించే సమయంలో పొలంలో గుండ్రంగా సుడులు ఏర్పడతాయి. తెల్లదోమ (సుడిదోమ) ప్రారంభ దశలో మొక్క మొదటి భాగంలో ఉన్నప్పుడు వేప నూనె ఎకరాకు లీటరు పిచికారీ చేస్తే సరిపోతుంది. తెల్లదోమ ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే బిప్రోపిజన్ 100 మి.లీ. లేదా ఎస్పేట్ 300 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్క తడిసేలా పిచికారీ చేయాలని ఆయన తెలిపారు.

గుంతల రహదారిపై అవస్థలు


తిరుమల థియేటర్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు

న్యూస్‌టుడే, సోంపేట

సోంపేట ప్రధాన మార్గం గోతులతో అధ్వానంగా తయారైంది. ఏడేళ్ల కిందట రహదారి నిర్మించినప్పటికీ పనుల్లో నాణ్యత లోపం కారణంగా తక్కువ సమయంలోనే మరమ్మతులకు గురైంది. గత ప్రభుత్వంలో ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో పలుచోట్ల ఏర్పడిన గుంతలతో వాహనాల రాకపోకలకు సమస్యలు తలెత్తుతున్నాయి. మురుగు నీటి వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం పడితే రోడ్డు మీదుగానే వరదనీరు ప్రవహించి అదనపు సమస్యలు తలెత్తుతున్నాయి.

సీసీ రోడ్డుతో సరిపెట్టారు..

ప్రధాన రోడ్డు అభివృద్ధికి గత ప్రభుత్వంలో రూ.4 కోట్లతో పనులు చేపట్టారు. రోడ్డుతో పాటు ఇరువైపులా మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. నిర్మాణంలో నెలకొన్న ఇబ్బందులతో ప్రారంభంలోనే రోడ్డు ధ్వంసమైంది. దీంతో తారురోడ్డుపై సీసీ రోడ్డు నిర్మించి అధికారులు చేతులు దులుపేసుకున్నారు. డ్రైనేజీ నిర్మాణానికి స్థలం లేకపోవడంతో ఒక్కోచోట ఒక్కోవిధంగా పనులు చేపట్టారు. తిరుమల, శ్రీనివాస థియేటర్ల వద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో రోజుకు నాలుగైదు ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. బీఎన్నార్ షాపింగ్‌మాల్ వద్ద మురుగునీరంతా రోడ్డు మీదుగా ప్రవహిస్తుండటంతో రహదారి దెబ్బతింది. సోమేశ్వర ఆలయం వీధి నుంచి చిన్నపల్లి వీధి వరకు రహదారి మరింత అధ్వానంగా తయారైంది. గోతులు పూడ్చి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


సోమేశ్వర ఆలయం కూడలి వద్ద ఇలా..

మరమ్మతులు చేపటాలి...

ప్రధాన రహదారి మరమ్మతులకు గురవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోజంతా వాహనాల రాకపోకలతో రోడ్డు రద్దీగా ఉంటుంది. ఏమరపాటున వాహనాలు నడిపితే గోతుల్లో పడిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. గుంతల్లో పూడ్చి మరమ్మతులు చేపట్టాలి. – కె.శ్రీనివాసరావు, సోంపేట

ప్రతిపాదనలు పంపాం..

రహదారి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్వాహణ పనులు చేపడతాం. తాత్కాలికంగా గోతులు పూడ్చేందుకు చర్యలు చేపడతాం.
– మోహన్‌రావు, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ

కళ్లుగప్పి కంకర కొల్లగొట్టే

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని రేగులపాడు సమీపంలో కంకర అక్రమ రవాణా జరుగుతోంది. వర్షాల ప్రభావం తగ్గి, వాహనాల రాకపోకలకు దారులు అనుకూలంగా ఉండడంతో అనుమతి లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. జిరాయితీ, డి-పట్టా భూముల్లో అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లకు, ఇతర పనులకు కంకర తరలిస్తూ కొంతమంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టరుకు రూ.1500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంత జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై తహసీల్దారు సి.సత్యనారాయణను వివరణ కోరగా కంకర తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం లేదని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


రేగులపాడు వద్ద జేసీబీతో తవ్వుతున్న కంకర

బాల్యం బక్కచిక్కుతోంది..

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

పోషకాహార లోపంతో చిన్నారులు బలహీనంగా మారుతున్నారు. పేదరికం, తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడం లాంటి కారణాలతో పిల్లలు బక్కచిక్కుతున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చేపట్టిన సమగ్ర సర్వే ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ సర్వే ప్రకారం కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో తీవ్ర పోషణ లోపం ఉన్నవారు 109, స్వల్ప పోషణ లోపం ఉన్నవారు 404 మందిగా గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 7002 మంది పిల్లలపై సర్వే చేశారు. బాలల బరువు, ఎత్తు, శారీరక పరిస్థితిని ప్రత్యేక యాప్‌లో పొందుపరిచారు. ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు.


పలాస మండలం తోసరాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు తూస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలో..

కాశీబుగ్గ ఐసీడీఎస్ పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు, పలాస-కాశీబుగ్గ పురపాలకల్లో మొత్తం 186 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 0 నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 7002 మంది ఉండగా.. 6953 మంది బరువు, ఎత్తు కొలిచారు. వీరిలో ఆరు నెలల నుంచి ఏడాది వయసున్నవారు 1099 మంది, ఏడాది నుంచి మూడేళ్లలోపు పిల్లలు 3266 మంది, కేంద్రాలకు వచ్చే 3 నుంచి 5 ఏళ్లలోపు వారు 1949 మంది ఉన్నారు. మిగిలిన చిన్నారులు 639 మంది 0 నుంచి 6 నెలలోపు వారే.


పిల్లలు (లేని వారు)	పోషణ లోపం	
	తీవ్రం	స్వల్పం
వయసుకు తగ్గ బరువు	46	212
ఎత్తుకు తగ్గ బరువు	63	192
వయసుకు తగ్గ ఎత్తు	146	548

పునరావాసం కేంద్రం ఉన్నా..

పోషకాహార లోపం తీవ్రంగా ఉన్న చిన్నారుల కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో పోషకాహార పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అక్కడికి పిల్లలను తీసుకెళ్తే కనీసం పదిహేను రోజుల పాటు వారిని గమనిస్తూ ప్రత్యేక ఆహారం అందిస్తారు. చిన్నారులతోపాటు సహాయకులకు భోజనం పెడుతూ.. వాళ్లకి రోజుకు రూ.100 చొప్పున ఇస్తారు. ఇంత మంచి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నా.. పోషకాహార పునరావాస కేంద్రాలపై తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపించడంలేదు. వీటిపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

చిన్నారులపై ప్రత్యేక దృష్టి..

పిల్లల్లో పోషణలోపం, ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేనివారు వివరాలు తెలుసుకున్నాం. వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. పోషకాహార మాసోత్సవాల్లో తల్లులకు అవగాహన కల్పిస్తున్నాం. లోపం మరీ ఎక్కువున్న పిల్లలను శ్రీకాకుళంలోని పోషకాహార పునరావాస కేంద్రానికి పంపిస్తున్నాం. దీనిపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. – వై.లావణ్య, సీడీపీవో, కాశీబుగ్గ ఐసీడీఎస్


మంత్రి సంధ్యారాణితో తెదేపాలో చేరిన సభ్యులు

సాలూరు అభివృద్ధికి రూ.30 కోట్లు

మెంటాడ, న్యూస్‌టుడే: సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డలో పింఛన్లు పంపిణీ చేశారు. నగదు మొత్తాలు పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఇళ్ల నిర్మాణాలకు మూడేసి సెంట్లు కేటాయించి, రూ.4 లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అరకు పార్లమెంటు పరిధిలో పోడు వ్యవసాయం చేసే గిరిజన రైతులకు పట్టాలు ఇస్తామని చెప్పారు. లోతుగెడ్డ సర్పంచి భీమారావు, వార్డు సభ్యులు, ఆర్య వైశ్య సంఘాధ్యక్షుడు కె.సత్యనారాయణ, పలు కుటుంబాలు ఆమె ఆధ్వర్యంలో తెదేపాలో చేరారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరావు, అరకు పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు అన్నవరం, ప్రచార కార్యదర్శులు జి.మసలినాయుడు, పి.గంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

97.11 శాతం మందికి పింఛన్లు

పార్వతీపురం, న్యూస్‌టుడే: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 97.11 శాతం మందికి పైగా లబ్ధిదారులకు తొలిరోజు అందజేశారు. మంగళవారం రాత్రి 8 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి ఇచ్చారు. సాలూరు నియోజకవర్గంలో మంత్రి జి.సంధ్యారాణి, పార్వతీపురం పట్టణంలో కలెక్టరు శ్యామ్‌కుమార్, పుర కమిషనర్ శ్రీనివాస్ పర్యటించి కార్యక్రమం పర్యవేక్షించారు. జిల్లాలో 1,42,393 మంది పింఛనుదారులకు గాను 1,38,276 లక్షల మందికి నగదు చేరవేసినట్లు అధికారులు చెబుతున్నారు.


సుందరీకరణ కలేనా..!



మందస మండలం అంబుగాం చెరువును అమృత్ సరోవర్ కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేపట్టేందుకు గత ప్రభుత్వం ఎంపిక చేసింది. చెరువులో శివుడి విగ్రహం ఏర్పాటుతో పాటు పరిశుభ్రంగా తీర్చిదిద్దడం, గట్టుపై మొక్కలు పెండం వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పది శాతం పనులు కాకుండానే ఆగిపోయాయి. రెండేళ్లు అవుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు నిధులు వస్తాయని అంటున్నారని, వస్తే మళ్లీ ప్రారంభిస్తామని సర్పంచి వెంకమ్మ తెలిపారు.
– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అల్లుకున్న నిర్లక్ష్యం

కవిటి మండలంలోని బైరిపురం, రాజపురం రహదారుల్లోని పలు స్తంభాలకు పనికిరాని మొక్కలు, పొదలు అల్లుకుపోయి నిత్యం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయా గ్రామాల ప్రజల చెబుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించట్లేదని వాపోతున్నారు. దీనిపై ఏఈ నేతాజీని వివరణ కోరగా రెండు రోజుల్లో మొత్తం తొలగిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



మంచినీటికి ఇక్కట్లు..



ఇచ్ఛాపురం పురపాలకసంఘం పదో వార్డు పెద్దాకులవీధిలో గత కొంతకాలంగా మంచినీటి బోరు మరమ్మతులకు నోచుకోవట్లేదు. కుళాయి నీరు రెండురోజులకోసారి వస్తుండటంతో స్థానికులు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు బాగుచేయాలని వేడుకుంటున్నారు. మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని పుర ఏఈ పి.కామేశ్వరరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ముళ్లపొదలు తొలగించరూ..

ఇచ్ఛాపురం పట్టణ ముఖద్వారంలో ఉన్న బాహుదా ఛానల్ వంతెన ఇరుకుగా ఉండటంతోపాటు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగడంతో వాహన చోదకులు గాయపడుతున్నారు. నిర్వహణ పనులు చేపట్టి పొదలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ.శాఖ ఏఈ పి.మోహనరావును వివరణ కోరగా.. ముళ్లపొదల తొలగింపు చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు ప్రతిపాదనలు పంపించామన్నారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

